# పుట్టింటి పట్టుచీర

ట్రింగ్... ట్రింగ్...

ట్రింగ్... ట్రింగ్... ట్రింగ్

గుమ్మం తలుపు తీస్తే తమ్ముడు!

నోరు తెరిచిన అక్కయ్య!

ఆమెలో సంభ్రమాశ్చర్యాలు !

"మీ తమ్ముణ్ణి అలా బయటనుంచోబెట్టి ఎంతసేపలా ఉంటావు? వాణ్ని లోపలికి రానియ్యి" బావ మాటలతో తేరుకుని ప్రక్కకు తొలగిన అక్కయ్య, తమ్ముడు లోపలకు వచ్చాడు.

"ఏంట్రోయ్ బామ్మర్దీ! దారి తప్పినట్టున్నావ్"

"దారి ఎప్పుడో తప్పాను బావా. ఇప్పుడే దార్లోకొచ్చాను".

"ముసలితనంలోనైనా దార్లోకొచ్చావు, అదే పదివేలు"

మా తమ్ముడు రాక, రాక వస్తే, మీ ఎకసెక్కాలేమిటి? రా తమ్ముడూ మనం లోపలి గదిలో కూర్చుందాం."

దాదాపు పదేళ్ల తర్వాత కలిసిన తమ్మునితో ఎన్నో సుద్దులు చెప్పుకోవాలనుంది అక్కయ్యకు. ప్రతి సంవత్సరం తను క్రమం తప్పకుండా రాఖీ పంపినా, ఏదైనా బహుమతి పంపడం అటుంచి రాఖీ ముట్టినట్టు కనీసం కార్డు ముక్క రాయని తమ్ముడు! ఎన్ని ఫోన్లు చేసినా స్పందించని తమ్ముడు! అయినా అక్కయ్యలో ఏ మాత్రం తరగని ఆప్యాయత. అందుకేనేమో 'పుట్టింటి కుక్కపై కూడా ఆడపడచులకి మక్కువెక్కువ' అని నానుడి. అక్కయ్య, తమ్ముడు లోపలిగదిలో తీరిగ్గా కూర్చుని ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. పదేళ్ళ ఎడబాటుని ఒకే రోజు మరుగున పడేయాలని ఆరాటం! ఒకటే ఇకఇకలు, పకపకలు. వారివారి పిల్లల చదువులు పెళ్ళిళ్ళ గురించి ఒకరికొకరు చెప్పుకున్నారు. తమ బంధువుల గురించి ముచ్చటించుకున్నారు. అక్కయ్య ఆప్యాయంగా ఇచ్చిన టిఫిను, టీ అమృతతుల్యంగా ఉన్నాయి తమ్మునికి. ఆ రుచి ఆస్వాదించి ఎన్నాళ్ళయిందో? ఆబగా మళ్ళీ మళ్ళీ అడిగి మరీ తిన్నాడు. తను చిన్నప్పుడు తమ్మునికి తినిపించిన గోరుముద్దలు జ్ఞప్తికి వచ్చాయి. తమ్మునికి కూడా తన చిన్నప్పటి జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. తమ్ముని కళ్ళల్లో కాంతిని, శాంతిని, తృప్తిని చూసి అక్కయ్య కడుపు నిండింది. మాటల్లో పడివారు సమయాన్ని మరచిపోయారు. సూర్యాస్తమయం అయి, పున్నమిచంద్రుడుదయించినా వారి కబుర్లకు తెరపడలేదు. వారి తనివితీరలేదు.

"మామయ్యా! ఈ రోజు ఇక్కడే ఉండి పోతావా" మేనల్లుడి పలకరింపుతో ఈ లోకంలోకిచ్చాడు తమ్ముడు.

"అరే, ఏడున్నరైందే? ఇక నేను బయలుదేరాలి, లేకపోతే మీ మరదలితో మాటపడాలి" అని బయలుదేరాడు తమ్ముడు.

"భోంచేసి వెళ్ళరా, ఎన్నాళ్ళయిందో మా ఇంట్లో చేయికడిగి" అక్కయ్య అభ్యర్ధన.

"మళ్లెప్పుడైనా అక్కయ్యా, ఇప్పుడు నేను వెళతాను. ఇక రోజూ వస్తుంటానుగా?"

అది మొదలు అక్కయ్య ఇంటికి రోజూ రావడం గంటలకు గంటలు గడపడం. టీ, ఫలహారాలేకాక, అప్పుడప్పుడు భోజనం కూడా చేయడం తమ్మునికి నియమిత మైంది. ఇంట్లో బావకు, పిల్లలకు వారి వారి దినచర్యలో కొన్ని అసౌకర్యాలు కల్గినా, అక్కయ్య మొహంలో కనిపించే మెరుపునూ ఆ తృప్తినీ గమనించి వారు గమ్మునున్నారు. ఓ రోజు తమ తల్లి మంచి మూడ్‌లో ఉండి, తన పుట్టింటివారి గురించి, ముఖ్యంగా తన తమ్ముని గురించి గొప్పలు చెబుతుంటే...

"అమ్మా! మీ పుట్టింటి వారికి, ఆడపడచుల సొమ్ము మెక్కడం అలవాటా. ఇన్ని నెలల నుంచి మామయ్య రోజూ మనింటికి వచ్చి మెక్కి పోతున్నాడు గదా. ఒక్కనాడైనా

మనల్ని వాళ్ళింటికి ఆహ్వానించాడా? భోజనం పెట్టి నీకు చీర, సారా పెట్టాడా? కనీసం జాకెట్టు ముక్క కూడా పెట్టలేదా మీ తమ్ముడు." నిలదీశాడు కొడుకు.

"అమ్మా! మనం బీదస్థితిలో ఉన్నప్పుడు మన నీడకూడా తమ మీద పడనీయని మీ తమ్ముడు ఇప్పుడు మనం కాస్త పచ్చగా ఉన్నామనే సరికి మరచిపోయిన బంధుత్వం జ్ఞాపకం వచ్చిందా?" దులిపేసింది కూతురు.

"మనం వాళ్ళ దగ్గర తీసుకున్న అప్పు, నెలకు మూడు శాతం వడ్డీతో వసూలు చేసిన మనిషి ఏ మొహం పెట్టుకుని ఇప్పుడు మన గడప తొక్కాడు? ఆ బాకీ వసూలు చేయడానికి పంచాయితీ పెట్టి నలుగురిలో నా పరువు తీసిన మనిషికి, ఇప్పుడు నా ఎదుట పడడానికి సిగ్గు, శరంలేదూ?" భర్త వాయించాడు. అక్కయ్య తలతీసేసినట్టయింది. మర్నాడు తమ్ముణ్ణి సంప్రదించి వీళ్ళందరికి పేరుపేరున తగిన జవాబు చెప్పాలని నిర్ణయించుకుంది. మర్నాడు యధావిధిగా తమ్ముడు హాజరు.

ప్రతిరోజూ లాగానే టీ, టిఫిన్లయ్యాక అక్కయ్య తమ్ముడు, పిచ్చాపాటిలో పడ్డారు. తమ్ముణ్ణి మాటల్లో పెట్టి మెల్లగా విషయం కదిపింది.

"తమ్ముడూ! నువ్వేమనుకోనంటే ఒక విషయం అడగనా?"

"అదేంటక్కయ్యా? మనలో మనకు మొహమాటాలేంటి? నీ మనసులోని మాట నిరభ్యంతరంగా చెప్పు"

"చాలా ఏళ్ళ ఎడబాటు తర్వాత ఇప్పుడు రోజూ నువ్వు మా ఇంటికి రావడం నాకు చాలా ఆనందంగా వుంది. మన చిన్ననాటి జ్ఞాపకాలు పునరావలోకనం చేస్తుంటే మధురమైన బాల్యం తిరిగి వచ్చినట్టుంది. మనం ఇలా అన్యోన్యంగా ఉండటంతో మీ బావ, పిల్లలకు కన్నుకుట్టినట్టుగా ఉంది." ఆగింది అక్కయ్య.

"మనం మనం మాట్లాడుకుంటే వాళ్ళకి కన్నుకుట్టడమేమిటి?"

"అదంతేరా! ప్రతి ఆడపడుచు పుట్టింటి పక్షపాతి అని మన సమాజంలో ఓ అపప్రథ ఉంది. మెట్టినింట్లో ఎన్ని సేవలందించినా, తమ జీవితాంతం భర్త, పిల్లలకు ఊడిగం చేయడానికి ధారపోసినా గుర్తింపు ఉండదు. పుట్టింటివారివైపు కాస్త ఆప్యాయంగా చూస్తే చాలు తమ సొమ్మేదో పుట్టింటి వారికి దోచిపెడుతుందని అభాండాలు వేస్తారు. ఇప్పుడు నువ్వు రోజూ వస్తున్నవా? ఏదో వచ్చావు కదా అని నేను మర్యాదకని టీ, ఫలహారాలు ఇస్తున్నానా? దానికే మా ఆస్తి నీకు దోచిపెట్టినట్టు మాట్లాడుతున్నారు. ముగ్గురూ కూడబలుక్కుని ఒకటే గోల. నువ్వు మాకు ఓ పూట భోజనం కూడా పెట్టించని పీనాసివట. ఆడపడుచుల సొమ్ము తినడం, మన

పుట్టింటివారికి ఆనవాయితీ ఆట. వీళ్ళ నోరు నువ్వే మూయించాలి. మమ్మల్నందరినీ పిలిచి మంచి విందు భోజనం ఏర్పాటు చేయి, నాకో మంచి పట్టుచీరకొను. అప్పుడు గాని వీరి తిక్క కుదరదు" అక్కయ్యకు తమ్మునిమీద ఎంత నమ్మకం! ఎన్ని ఆశలు? అక్కయ్య నోటి నుండి ఈ మాటలు వెలువడగానే తమ్ముని మొహంలో రంగులు మారాయి. తేరగా తినే యోగం సమాప్తమయిందనుకున్నాడు. అయినా వెంటనే సర్దుకున్నాడు.

"అదేంటక్కా మీకు ఓ పూట భోజనం పెట్టలేమా? అంత గతిలేకుండా ఉన్నామా మేము? కాకపోతే ఒకేచిక్కు. నీకు నీ మరదలి స్వభావం తెలుసుకదా? అప్పుడెప్పుడో నువ్వన్న మాటలు జ్ఞాపకం చేసుకుని, ఇంకా నిన్ను ఆడిపోసుకుంటుంది. 'నిన్ను, నన్ను, అన్ని మాటలన్న వదిన ఇంటికి రోజూ పోతూ ఇంకా దేబిరిస్తున్నావని' నన్ను దెప్పుతుంది. పిల్లలు కూడా దానికే వత్తాసు పలుకుతారు. ఇలాంటి సన్నివేశంలో మిమ్మల్ని ఇంటికి పిలిస్తే మళ్ళీ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని భయంగా ఉంది. తన నోటి దురుసు తనంతో నీ మరదలు నిన్నేమైనా అంటే నేను తట్టుకోలేను. అందుకే మిమ్మల్ని ఇంటికి పిలవలేకపోయాను."

తమ్ముని మాటలతో అక్కయ్యలో నిరాశ. తన భర్త, పిల్లల నోళ్ళు మూయించాలనే తన కోరిక నెరవేరే ఆస్కారం లేనందుకు నిస్పృహ. ఇప్పుడు ఏం చేయాలో తోచడంలేదు. తమ్ముని ధోరణి మెల్లమెల్లగా అర్థంకాసాగింది. అయినా ఆశ చావక. "తమ్ముడూ, భోజనం లేకపోతే మానె, ఈసారి నువ్వొచ్చినపుడు ఓ మంచి పట్టుచీర పట్టుకురారా, అలా అయినా వీళ్ళ నోళ్ళు మూయిస్తాను." గతుక్కుమన్నాడు తమ్ముడు. అక్కయ్య తనని సులువుగా వదిలేట్టు లేదు.

"దానికేం భాగ్యమక్కయ్యా! తప్పకుండా ఓ కంచి పట్టుచీర కొంటానునీకు. బావకు రేమండ్ సూటు గుడ్డ, పిల్లలకు బట్టలు అన్నీ కొంటాను. మా ఇంట్లో కాకపోతేనేమి, మంచి హోటల్లో డిన్నరు ఏర్పాటు చేసి మీ అందరికీ బట్టలుపెడతాను. అలా అయినా నీ రుణం కొంత మేరకు తీరుతుంది.

"నువ్వు మాకు డిన్నరిచ్చి, బట్టలుపెట్టావని తెలిస్తే మరదలు పిల్ల నిన్నూ, నన్నూ ఇంకా ఆడిపోసుకోదూ? అదేం వద్దులే, మళ్ళీ నీకు రోజూ ఇంట్లో అదో పోరు." అక్కయ్యలో ఆందోళన.

"ఆ పోరు నాకు కొత్త కాదు. నీ కొరకు నేను ఎన్ని మాటలైనా పడతాను. నాకు నువ్వే ముందు, ముఖ్యం. నీ తర్వాతే వేరెవరైనా. నీ పెంపకంలో పెరిగిననేను, నీకు

ఈ మాత్రం చేయలేనా? సరే, ఇక వస్తాను" గంటల తరబడి కూర్చునే తమ్ముడు ఆ రోజు అరగంటలోపలే తిరుగుముఖం పట్టాడు.

అక్కా తమ్ముళ్ళ సంభాషణ విన్న ఇంట్లో వాళ్ళు అక్కయ్యను మళ్ళీ ఆటపట్టించారు. మీ తమ్ముడు, బెల్లం వేయకుండానే బూరెలు చేయడంలో చేయి తిరిగిన వాడని వెక్కిరించారు. అతను మళ్ళీ మన గడప తొక్కబోడని భాష్యం చెప్పారు. పరాన్న భుక్కుడైన తమ్ముణ్ణి మరచిపొమ్మని సలహా ఇచ్చారు. మీ తమ్మునికి పెట్టే మనసుంటే మార్గమే దొరకదా? అతని సాకులు మాకు తెలియనివికావు అని ఎద్దేవా చేశారు. తమ్ముని స్పందనతో అసలే చితికిపోయిన అక్కయ్య, ఇంట్లో వారి దెప్పుడుతో ఇంకా చితికిపోయింది. కళ్ళనిండా నీళ్ళతో వంటింటివైపు అడుగులు వేసింది.

భర్త, పిల్లల భాష్యం నిజమయింది. తమ్ముని రాకపోకలు ఆగిపొయ్యాయి. ఫోన్లో కూడా పొడిపొడి మాటలు. అక్కయ్యకు మరోసారి ఆశాభంగమయింది. అప్పటినుండి మనోవ్యథతో కృంగి కృషించసాగింది. భర్త పిల్లలు "నీకు మేమున్నాంగదా ఎందుకు దిగులు?" అని ఎంత సాంత్వన పరచినా, ఆమె వ్యథ తగ్గలేదు. తన పుట్టింటి వారి వల్ల మెట్టింట్లో తన పరువు పోయిందే అని, అదే పనిగా కుమిలిపోసాగింది అక్కయ్య. ఆ మనోవ్యథ, ఆమె మరణంతోకాని అంతంకాలేదు.

అందరితో పాటు తమ్మునికి కూడా కబురుచేద్దామంటే ససేమిరా అన్నారు పిల్లలు. అయినా భార్య ఆత్మశాంతి కొరకై బావ, తన బావమర్దికి కబురు చేశాడు. మరదలు రాలేదు. తమ్ముడు మాత్రం వచ్చాడు. రాగానే అక్కయ్య కాళ్ళ మీదపడి వెక్కివెక్కి ఏడవసాగాడు.

"నీ దృష్టిలో కృతఘ్నునిగానే మిగిలిపోయానక్కయ్యా! మన తల్లి, నా చిన్నతనంలోనే పక్షవాతం వచ్చి మంచానపడితే నువ్వే కదా నన్ను పెంచి పెద్ద చేశావు. అలాంటి నీకు, నేనేమీ చేయలేకపోయాను. భార్య ఎదుట నోరుతెరువలేని చవటనక్కయ్యా నేను. 'ఒక్క పట్టుచీర పెట్టరా' అని నోరారా అడిగినా నీ కోరిక తీర్చని దద్దమ్మని నేను. ఉద్యోగంలోంచి రిటైరైనాక ఎప్పుడూ నా జేబులో యాభై రూపాయల కంటే ఎక్కువ లేవంటే నమ్ముతావా నువ్వు? నాకు ఇంట్లో తిండి కూడా సరిగా పెట్టరంటే నమ్ముతావా నువ్వు? ఆ మధ్య మీ ఇంట్లో గడిపిన కొన్ని నెలలే నా జీవితంలో మధుర క్షణాలు. అప్పుడే నేను కాస్త తృప్తిగా భోం చేశాను. అంతా నా స్వయంకృతాప రాధం. నీ మరదలు, పిల్లల చేతిలో కీలుబొమ్మనయ్యాను. నాకంటూ ఏమీ మిగుల్చు కోకుండా, ఉన్నదంతా వాళ్ళకు ఊడ్చిపెట్టాను. నా ఆస్తి తమ పేరు చేసే దాకా నన్ను

ఊపిరి సలుపనీయలేదు. ఆ తర్వాత ఈడ్చితన్నారు. అందుకే అక్కయ్యా నీ చివరి కోరిక, నీవు బతికుండగా తీర్చలేకపోయాను. ఇప్పుడు తలతాకట్టుపెట్టి, డబ్బు సర్దుబాటు చేశాను. నన్ను క్షమించమని అడిగే అర్హతకూడా నాకు లేదక్కయ్యా. అయినా అడుగుతున్నాను.

నన్ను క్షమించక్కయ్యా. క్షమిస్తావు కదూ? అవును క్షమిస్తావు. తప్పక క్షమిస్తావు. నీకు భూమికున్నంత ఓపిక. మరోసారి అడుగుతున్నాను. నన్ను క్షమించక్కయ్యా, నన్ను క్షమించక్కయ్యా" అని రోదిస్తూ అక్కయ్య శవంపై, సొమ్మసిల్లిపడ్డాడు తమ్ముడు.

ఆ రోజు అక్కయ్య అంతిమయాత్రలో ఆమెకు చుట్టింది 'పుట్టింటి పట్టుచీర'!

నది మాసపత్రిక

ఫిబ్రవరి 2009